RNI No Tel / 2012 /4241

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..

# హైదరాబాద్ ఎస్టేట్

తెలుగు దిన పత్రిక

THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER

hyderabadestate.co.in

సంపుటి -13 సంచిక - 458 | 26 బుధవారం ఆగస్టు 2026 | ఎడిటర్: బట్టు లక్ష్మీ నారాయణ | పేజీలు - 6 వెల రూ 5 /--




## సెప్టెంబర్ 7 నుంచి తెలంగాణ

# అసెంబ్లీ సమావేశాలు..

## ఎన్నికల వయసు తగ్గింపుపై కీలక తీర్మానం!

తెలంగాణ శాసనసభ సమావేశాలు సెప్టెంబర్ 7వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. సచివాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ విషయాన్ని శాసనసభ్యులకు వెల్లడించారు. అయితే, ఈ సమావేశాలు ఎన్ని రోజుల పాటు కొనసాగుతాయి, సభా అజెండా ఏమిటన్న అంశాలపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. ఈ సమావేశాల్లో ప్రభుత్వం ఒక కీలక తీర్మానాన్ని ఆమోదించే అవకాశం ఉంది. లోక్‌సభ, శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల కనీస వయసును 25 ఏళ్ల నుంచి 21 ఏళ్లకు తగ్గించాలని కోరుతూ సభలో తీర్మానం చేయనున్నారు. అనంతరం దీనిని కేంద్ర ప్రభుత్వానికి పంపి, పార్లమెంటులో సంబంధిత బిల్లును ప్రవేశపెట్టాలని కోరనున్నారు. చట్టసభల్లో యువతకు మరింత ప్రాతినిధ్యం కల్పించాలనే ఉద్దేశంతోనే ఈ మార్పును ప్రతిపాదిస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గతంలోనే పేర్కొన్నారు. నియోజకవర్గాల అభివృద్ధి పనులపై కూడా ముఖ్యమంత్రి ఈ సమావేశంలో సమీక్ష జరిపారు. పెండింగులో ఉన్న సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని ఆయన ఎమ్మెల్యేలను ఆదేశించారు. భూసేకరణలో జాప్యం జరిగితే ప్రాజెక్టుల నిర్మాణం నిలిచిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. భూసేకరణ, పునరావాసం, అటవీ శాఖ అనుమతులకు అవసరమైన నిధులను ప్రభుత్వం మంజూరు చేస్తుందని ఆయన హామీ ఇచ్చారు. ప్రతి ఎమ్మెల్యే తమ నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.



# ప్రభుత్వం తప్పు చేస్తే..

## ప్రజలు ఎందుకు శిక్ష అనుభవించాలి?

### : హరీశ్ రావు



మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి లక్ష్యంగా బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కుత్బుల్లాపూర్‌లో నిర్వహించిన 22ఏ (22ఎ) బాధితుల సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే వివేకానందతో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... తప్పు చేసింది ప్రభుత్వమైతే, కార్యాలయాల చుట్టూ తిరుగుతూ ప్రజలు ఎందుకు శిక్ష అనుభవించాలని ప్రశ్నించారు. వందలాది కాలనీల అధ్యక్షులు, వేలాది మంది బాధితులు తమ భూములను నిషేధిత 22ఏ జాబితాలో పెట్టారంటూ ఆవేదనతో ఇక్కడికి వచ్చారని హరీశ్ రావు పేర్కొన్నారు. "భూములను 22ఏలో పెట్టడం మీ వంతు.. మళ్లీ వాటిని తొలగించుకోవడానికి దరఖాస్తులు పట్టుకుని ఆఫీసుల చుట్టూ తిరగడం ప్రజల వంతా?" అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని సూటిగా నిలదీశారు. ప్రభుత్వం చేసిన తప్పును వెంటనే సవరించాల్సిన బాధ్యత మంత్రిపైనే ఉందన్నారు. లక్షలాది మంది ఆస్తులను రాత్రికి రాత్రి 22ఏ జాబితాలో చేర్చి, ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేశారని మండిపడ్డారు. 30 శాతం కమీషన్ల దురాశతోనే ఈ భూములన్నింటినీ 22ఏలో పెట్టారంటూ హరీశ్ రావు ఆరోపించారు. మంత్రి అత్యాశ ఏదో ఒకరోజు ఆయన దుఃఖానికి కారణమవుతుందని హెచ్చరించారు. ప్రభుత్వ కుట్రల వల్ల లక్షలాది మంది జీవితాలు నాశనమవుతున్నాయని... పిల్లల పెళ్లిళ్లు ఆగిపోతున్నాయని, దవాఖాన ఖర్చుల కోసం ఆస్తులను బ్యాంకుల్లో కుదువ పెడదామంటే బ్యాంకులు సైతం తీసుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రాపర్టీల విలువలు పడిపోయి, అప్పు పుట్టక, ఆస్తులు అమ్ముకోలేక బాధితులు తీవ్ర అవస్థలు పడుతున్నారని తెలిపారు. కాబట్టి ప్రజలతో ఆన్‌లైన్ దరఖాస్తులు పెట్టించకుండా, ప్రభుత్వం వెంటనే ఈ 22ఏ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

# తెలంగాణలో విస్తారంగా వర్షాలు..

## నిండుతున్న ప్రాజెక్టులు



అల్పపీడన ప్రభావంతో తెలంగాణ వ్యాప్తంగా గత రెండు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఈ వర్షాలతో వాగులు, వంకలు పొంగిపొర్లుతుండగా, పలు ప్రాజెక్టులకు జలకళ వచ్చింది. ఎండిపోతున్న పంటలకు జీవం పోసిన ఈ వర్షాలు రైతుల్లో ఆనందాన్ని నింపుతున్నాయి. మరోవైపు, భారీ వర్షాల కారణంగా సింగరేణి గనుల్లో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. గడిచిన 24 గంటల్లో మెదక్ జిల్లా పెద్దశంకరంపేటలో అత్యధికంగా 11 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. సంగారెడ్డి, వికారాబాద్, కామారెడ్డి, నారాయణపేట, మహబూబ్ నగర్ జిల్లాల్లోనూ పలుచోట్ల భారీ వర్షాలు కురిశాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలోనూ వర్ష ప్రభావం ఎక్కువగా ఉంది. ఈ వర్షాలతో గోదావరి బేసిన్‌లోని ప్రాజెక్టులు నిండుతున్నాయి. నిజాంసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి మట్టానికి (1,405 అడుగులు) చేరువ కాగా, ప్రస్తుతం నీటిమట్టం 1,401 అడుగులకు చేరింది. శ్రీరామ్ సాగర్ జలాశయంలో నీటిమట్టం 44 టీఎంసీలు దాటింది. కొత్తగూడెం జిల్లాలోని తాలిపేరు ప్రాజెక్టుకు భారీగా వరద వస్తుండటంతో 17 గేట్లు ఎత్తి 74,000 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజ్‌కు వరద పోటెత్తడంతో 85 గేట్లు ఎత్తి నీటిని కిందికి వదులుతున్నారు. మరోవైపు, భారీ వర్షాల కారణంగా ఇల్లందు, మణుగూరులోని సింగరేణి ఓపెన్ కాస్ట్ గనుల్లోకి వరద నీరు చేరడంతో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం కలిగింది. కాగా, రాష్ట్రంలో మరో నాలుగు రోజుల పాటు (ఆగస్టు 28 వరకు) తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కొనసాగుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ మేరకు 26 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

## ఏపీ లోకాయుక్తగా జస్టిస్ మల్లిఖార్జునరావు

# ప్రమాణ స్వీకారం..

### - హాజరైన సీఎం చంద్రబాబు



ఆంధ్రప్రదేశ్ నూతన లోకాయుక్తగా హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ తల్లాప్రగడ మల్లిఖార్జునరావు బాధ్యతలు స్వీకరించారు. విజయవాడలోని లోక్‌భవన్‌లో మంగళవారం ఉదయం జరిగిన కార్యక్రమంలో గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ ఆయనతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరై, నూతన లోకాయుక్తగా బాధ్యతలు చేపట్టిన జస్టిస్ మల్లిఖార్జునరావుకు పుష్పగుచ్ఛం అందించి హృదయపూర్వకంగా అభినందనలు తెలిపారు.

ప్రమాణ స్వీకారం ముగిసిన అనంతరం జస్టిస్ మల్లిఖార్జునరావు, ముఖ్యమంత్రి చంద్రబాబు, గవర్నర్ అబ్దుల్ నజీర్ కాసేపు ముచ్చటించారు. పరిపాలనలో పారదర్శకత, అవినీతి నిర్మూలనకు లోకాయుక్త వ్యవస్థ ప్రాధాన్యాన్ని ఈ సందర్భంగా వారు గుర్తుచేసుకున్నారు. అనంతరం లోక్‌భవన్‌లో ఏర్పాటు చేసిన అల్పాహార విందులో గవర్నర్, ముఖ్యమంత్రి పాల్గొన్నారు.

ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఇతర ఉన్నతాధికారులు, న్యాయశాఖకు చెందిన ప్రముఖులు హాజరయ్యారు. జస్టిస్ మల్లిఖార్జునరావు నియామకంతో రాష్ట్రంలో పరిపాలన మరింత జవాబుదారీగా మారుతుందని పలువురు ఆశాభావం వ్యక్తం చేశారు.

## ప్రభుత్వ భూముల పరిరక్షణే

# 22ఏ ప్రధాన లక్ష్యం

### : పొంగులేటి



22ఏ నిషేధిత భూముల జాబితాపై ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని నమ్మవద్దని, ఈ విషయంలో ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. సచివాలయంలో నిన్న నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములను కాపాడటంతో పాటు, చట్టబద్ధమైన ప్రైవేట్ ఆస్తులకు రక్షణ కల్పించడమే 22ఏ ప్రాథమిక ఉద్దేశమని వివరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నకిలీ జీవోలు, మెమోలు, సర్టిఫికెట్లతో భారీ ఎత్తున భూదందాలు జరిగాయని మంత్రి ఆరోపించారు. ప్రస్తుత ప్రభుత్వం రికార్డులను ప్రక్షాళన చేస్తూ, ప్రభుత్వ భూములను కాపాడే ప్రయత్నం చేస్తోందని తెలిపారు. లక్షల ఎకరాలను నిషేధిత జాబితాలో చేర్చారంటూ వస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. భూదాన్, అసైన్డ్, ప్రభుత్వ భూములకు సంబంధించి నకిలీ పత్రాలు సృష్టించిన వారిపై కఠినమైన క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా మంత్రి కొన్ని ఉదాహరణలను ప్రస్తావించారు. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం అన్నారంలో సర్వే నంబర్ 172లోని ప్రభుత్వ భూమిని, సర్వే నంబర్ 173గా చూపి అక్రమంగా నిర్మాణాలు చేపట్టారని తెలిపారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో కేవలం రెండు ప్లాట్లు మాత్రమే నిషేధిత జాబితాలో ఉండాల్సి ఉండగా, గతంలో ముఖ్యమంత్రితో పాటు తన నివాసాలు ఉన్న మొత్తం 1280 ఎకరాలను 22ఏ కింద చేర్చారని, అనంతరం ఆ పొరపాటును సరిదిద్దామని పేర్కొన్నారు. అలాగే మెదక్ జిల్లాలో 522 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడామని వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో వివాదాస్పద సీఎస్-7, సీఎస్-14 భూముల వ్యవహారంలో భారీ అక్రమాలు జరిగాయని, ప్రధాన ప్రతిపక్షం డిమాండ్ చేస్తే సిట్టింగ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (సెట్) విచారణకు తాము సిద్ధంగా ఉన్నామని మంత్రి సవాల్ విసిరారు. 22ఏ టోల్ ఫ్రీ నంబర్‌కు వచ్చిన 980 ఫిర్యాదుల్లో 98 శాతం పరిష్కరించామని, సాంకేతిక కారణాలతో రిజిస్ట్రేషన్లు పూర్తికాని వారికి ఈ వారాంతంలోగా ఫీజులు వాపసు చేస్తామని హామీ ఇచ్చారు.

## రేవంత్ ప్రెస్‌మీట్ గురించి మంత్రులకే

# సమాచారం లేదు

### : ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్



తెలంగాణలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ పాలన తీవ్ర అస్తవ్యస్థంగా ఉందనడానికి కేబినెట్‌లోని మంత్రుల మధ్య సయోధ్య లేకపోవడమే నిదర్శనమని బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన పరిణామాలను ప్రస్తావిస్తూ ప్రభుత్వంపై ప్రశ్నల వర్షం కురిపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేరుగా లండన్ పర్యటన నుంచి వచ్చి, తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి సంబంధించిన అంశంపై అత్యవసర ప్రెస్‌మీట్ ఏర్పాటు చేస్తే... ఆయన పక్కన ఉండాల్సిన కేబినెట్ మంత్రులకు ఆ సమావేశం గురించిన సమాచారం కూడా లేకపోవడం ఆశ్చర్యకరమని అన్నారు. ఒకే సచివాలయంలో కేబినెట్ సబ్ కమిటీ సమావేశంలో పాల్గొన్న మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, మల్లు భట్టి విక్రమార్క మీడియా సమావేశం ముగించిన కేవలం 10 నిమిషాల వ్యవధిలోనే ముఖ్యమంత్రి ప్రెస్‌మీట్ పెట్టినప్పటికీ, ఆయన సహచర మంత్రులెవరూ ఆ భేటీకి హాజరుకాకపోవడాన్ని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఎత్తిచూపారు. రాష్ట్రంలో పాలనా యంత్రాంగం ఎలా ఉందో చెప్పడానికి ఈ ఘటనే ప్రత్యక్ష నిదర్శనమని, ఒక ముఖ్యమైన అంశంపై నిర్ణయం తీసుకునే విషయంలో స్వయంగా కేబినెట్‌లోని మంత్రుల మధ్యే సయోధ్య, కనీస సమాచారం లేని పరిస్థితి నేడు తెలంగాణలో నెలకొందని ఆయన విమర్శించారు.

# 'అర్హత లేని వ్యక్తులను కలవాలనుకున్నారు'..

## రేవంత్ అమెరికా టూర్‌పై కిషన్‌రెడ్డి ఫైర్



తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటనపై చేసిన వ్యాఖ్యలకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కౌంటర్ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వంపై సీఎం చేసిన ఆరోపణలు అర్థరహితమని మండిపడ్డారు. ఢిల్లీలో మంగళవారం మీడియాతో మాట్లాడిన ఆయన.. కేంద్రం అనుమతి రాకముందే రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటనను హడావుడిగా ఖరారు చేసుకున్నారని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి గతంలో అమెరికా, లండన్ సహా ఇతర దేశాలకు వెళ్లేందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందని కిషన్‌రెడ్డి తెలిపారు. ఈసారి మాత్రం స్పష్టమైన పరిపాలనా కారణాలతో విదేశాంగ శాఖ అనుమతి ఇవ్వలేదని చెప్పారు. విదేశీ పర్యటనల్లో ముఖ్యమంత్రి ఎవరిని కలుస్తారు? ఆ సమావేశాలతో దేశానికి ఏమైనా ప్రయోజనం ఉందా? అనే అంశాలను విదేశాంగ శాఖ పరిశీలిస్తుందని వివరించారు. అమెరికా పర్యటనలో రేవంత్‌రెడ్డి అర్హత లేని వ్యక్తులను కలవాలని నిర్ణయించుకున్నారని కిషన్‌రెడ్డి ఆరోపించారు. పాకిస్థాన్‌కు అనుకూలంగా వ్యవహరించే, భారత్‌పై విమర్శలు చేసే వ్యక్తితో సమావేశం ఎందుకని ప్రశ్నించారు. ప్రధాని మోదీని ఉగ్రవాదితో పోల్చిన వ్యక్తి న్యూయార్క్ మేయర్ మమ్దానీ కాదా? అని నిలదీశారు. న్యూయార్క్‌లో హిందువుల పండుగలపై ఆంక్షలు విధించిన వ్యక్తితో సీఎం భేటీ కావడం ఏంటని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి తన హోదాకు తగిన వ్యక్తులతోనే చర్చలు జరపాలని కిషన్‌రెడ్డి సూచించారు. సీఎం స్వయంగా విదేశాలకు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. పెట్టుబడుల కోసం అధికారుల బృందాన్ని పంపినా ప్రయోజనం ఉంటుందని చెప్పారు. 2005లో గుజరాత్ సీఎంగా ఉన్న నరేంద్ర మోదీ అమెరికా పర్యటనను అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డుకున్న విషయాన్ని కూడా కిషన్‌రెడ్డి గుర్తు చేశారు.

RNI No Tel / 2012 /4241
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in



# డబల్ బెడ్ రూమ్ కాలనీ వద్ద ఘనంగా 'వన మహోత్సవం'

## మొక్కలు నాటిన మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్, కమిషనర్ గణేష్

**హైదరాబాద్ ఎస్టేట్ లక్ష్మీ నారాయణ**

పెబ్బేరు మున్సిపాలిటీ పరిధిలోని డబల్ బెడ్ రూమ్ కాలనీ సమీపంలో వన మహోత్సవ కార్యక్రమంలోని భాగంగా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవాల్సిన బాధ్యత సమాజంలోని ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా భావితరాలకు స్వచ్ఛమైన గాలి, ఆహ్లాదకరమైన వాతావరణం అందించాలంటే విస్తృతంగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లోనూ పచ్చదనాన్ని పెంపొందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ గణేష్ మాట్లాడుతూ కేవలం మొక్కలు నాటడమే కాకుండా, అవి పెరిగి పెద్దయ్యే వరకు సంరక్షించడమే ప్రధాన ధ్యేయంగా పనిచేస్తున్నామని తెలిపారు. కాలనీవాసులు నాటిన మొక్కల సంరక్షణలో భాగస్వాములై పరిసరాలను పచ్చదనంతో నింపాలని కోరారు. ద
ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ ప్రమోదిని, వైస్ చైర్మన్ విజయ వర్ధన్ రెడ్డి, పలువురు వార్డు కౌన్సిలర్లు మంగరాయి మన్యం,పర్వీన్ షకీల్, జమ్ములమ్మ, శివసాయి, తాటికొండ కృష్ణ, భాగ్యలక్ష్మి శివ, పట్టణ అధ్యక్షులు కొంతం దయాకర్ రెడ్డి,మాజీ వార్డ్ మెంబర్ సుధాకర్ గౌడ్, మున్సిపల్ సిబ్బంది మరియు కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాను మంత్రివర్గం నుండి బర్తరఫ్ చేయాలి

## రాష్ట్ర అధ్యక్షుడు శివ చరణ్ రెడ్డి

**హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి ఎల్బీనగర్**

రంగారెడ్డి జిల్లా యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో తుక్కుగూడ చౌరస్తాలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించి, అమిత్ షా దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ కార్యక్రమానికి యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు జక్కిడి శివచరణ్ రెడ్డి గారు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.
ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు జక్కిడి శివచరణ్ రెడ్డి గారు మాట్లాడుతూ.. నీట్ పేపర్ లీకేజీపై శాంతియుతంగా నిరసన చేస్తున్న విద్యార్థులపై పెల్లెట్ గన్లతో కాల్పులు జరపడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. ఈ చర్యపై కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ గారు బాధితులతో కలిసి స్వయంగా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ పోలీస్ యంత్రాంగం స్పందించకపోవడం బాధాకరమని అన్నారు.

ఈ కాల్పుల ఘటనపై తక్షణమే ప్రధాని మోడీ స్పందించి సంబధితశాఖ మంత్రి అమిత్ షాను మంత్రివర్గం నుండి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాహుల్ గాంధీ గారు, ఉదయ్ భాను చిబ్ గార్ల నేతృత్వంలో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో మరిన్ని ఉద్యమాలు, పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు నాగేందర్ రెడ్డి, జిల్లా ఇంచార్జ్ సంతోష్ గౌడ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి, ఏనుగు జంగారెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుర్రం శ్యాంచరణ్ రెడ్డి, నియోజకవర్గ అధ్యక్షులు సుభాన్ యాదవ్, శివ కుమార్, మహిపాల్ యాదవ్, మహేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.




# ఎన్ని పార్టీలు.. ఎన్ని ప్రభుత్వాలు.. ఎంత మంది నాయకులు మారినా.. జూకల్ రోడ్డు గతి మారదా?

## నాయకులు మారుతున్నారు.. ప్రభుత్వాలు మారుతున్నాయి.. కానీ జూకల్ రోడ్డు మాత్రం ఎక్కడ వేసిన గొంగడి అక్కడే!

**హైదరాబాద్ ఎస్టేట్ చిట్యాల ప్రతినిధి మ్యాదరి సునీల్**

తిరుమలాపూర్‌జూకల్ రహదారి దుస్థితి..
ప్రయాణికులకు తప్పని తిప్పలు
జూకల్: ఎన్ని పార్టీలు మారినా.. ఎన్ని ప్రభుత్వాలు మారినా.. ఎంత మంది నాయకులు మారినా జూకల్ గ్రామానికి వచ్చే రహదారి పరిస్థితి మాత్రం మారడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు పలుమార్లు గ్రామానికి వచ్చినా రహదారి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించకపోవడంపై ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది.
తిరుమలాపూర్ నుంచి జూకల్ గ్రామానికి వచ్చే ప్రధాన రహదారి ప్రారంభంలోనే పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి, వర్షం పడితే బురదమయంగా మారుతోంది. రహదారిపై నీరు నిలవడంతో వాహనదారులు గుంతలను తప్పించుకుంటూ ప్రయాణించాల్సి వస్తోంది. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు, ఆటో డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
నాయకులు వస్తున్నారు.. హామీలు ఇస్తున్నారు.. సమస్య మాత్రం అలాగే!
గ్రామంలో పలు సందర్భాల్లో నాయకులు, ప్రజాప్రతినిధులు పర్యటించినప్పుడు రహదారి సమస్యను స్థానికులు వారి దృష్టికి తీసుకెళ్తున్నప్పటికీ, సమస్య పరిష్కారం మాత్రం ఆచరణలో కనిపించడం లేదని గ్రామస్థులు అంటున్నారు. ఎన్నికలు వచ్చినప్పుడు రోడ్డు సమస్యపై హామీలు వినిపిస్తున్నాయని, ఎన్నికలు ముగిసిన తర్వాత పరిస్థితి మళ్లీ మొదటికి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
రాత్రివేళల్లో రహదారిపై ఉన్న గుంతలు సరిగా కనిపించకపోవడంతో ప్రమాదాల భయం నెలకొంటోందని వాహనదారులు చెబుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్‌లు, ఇతర వాహనాలు కూడా ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.
ఇక హామీలు వద్దు.. శాశ్వత రోడ్డు కావాలి
జూకల్ గ్రామానికి రాకపోకలకు కీలకమైన ఈ రహదారిని అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేకంగా పరిశీలించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. తాత్కాలికంగా గుంతలు పూడ్చడం కాకుండా నాణ్యమైన రహదారి నిర్మాణం చేపట్టి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేస్తున్నారు.



"పార్టీలు మారాయి.. ప్రభుత్వాలు మారాయి.. నాయకులు మారారు.. కానీ మా జూకల్ రోడ్డు పరిస్థితి మాత్రం మారలేదు. ఇకనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రహదారిని బాగు చేయాలి" అని గ్రామస్థులు కోరుతున్నారు.

# ప్రజారోగ్యంపై డీఎంహెచ్ఓ ఆకస్మిక తనిఖీ

**హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఆగస్టు 25:-**

**రంగారెడ్డి జిల్లా:** ప్రజలకు అందుతున్న వైద్య సేవల నాణ్యతను పరిశీలించేందుకు జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డా. స్వర్ణకుమారి హాఫీజ్‌పేట్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను ఆకస్మికంగా సందర్శించారు. కేంద్రంలో వైద్య సేవల నిర్వహణ తీరును క్షుణ్ణంగా పరిశీలించి, రోగులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది హాజరు పట్టిక, రోగుల నమోదు, బాహ్య రోగుల సేవలు, మందుల నిల్వలు, వైద్య రికార్డుల నిర్వహణ, సిబ్బంది పనితీరు, ఆసుపత్రి పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వైద్య సేవలను సక్రమంగా అందించాలని సిబ్బందికి సూచించారు. ప్రతి రోగికి సకాలంలో వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను అందించడంతో పాటు ఆరోగ్యంపై తగిన సూచనలు చేయాలని డీఎంహెచ్ఓ ఆదేశించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ ఆరోగ్య కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేసేలా అంకితభావంతో పనిచేయాలని సూచించారు.



ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో అర్బన్ హెల్త్ సెంటర్లు కీలక పాత్ర పోషిస్తున్నాయని డా. స్వర్ణకుమారి పేర్కొన్నారు. ప్రజారోగ్య పరిరక్షణే ఆరోగ్య శాఖ ప్రధాన ధ్యేయమని, సేవల్లో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ఈ తనిఖీలో జిల్లా కార్యక్రమ అధికారి అక్రమ్, జాతీయ ఆరోగ్య కార్యక్రమ అధికారి డా. జ్యోతిబాయి తదితరులు పాల్గొన్నారు.

# పచ్చదనం కోసం ప్రతి ఒక్కరి చేయూత

**హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఆగస్టు 25:-**



రంగారెడ్డి జిల్లా: వన మహోత్సవాన్ని ప్రజా ఉద్యమంగా మలిచి పచ్చదనాన్ని విస్తరించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని అటవీ దళాల అధిపతి, ప్రధాన ముఖ్య అటవీ సంరక్షణాధికారి వినయ్ కుమార్, ఐఎఫ్ఎస్ పిలుపునిచ్చారు. భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలంటే మొక్కల పెంపకం ప్రతి ఒక్కరి బాధ్యతగా మారాలని సూచించారు. వన మహోత్సవంలో భాగంగా మంగళవారం రంగారెడ్డి జిల్లాలోని ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ఈఐఎస్ బాలుర పాఠశాల, జూనియర్ కళాశాల ప్రాంగణంలో విస్తృతంగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 2,200 మొక్కలను నాటారు. రాష్ట్రవ్యాప్తంగా సెప్టెంబర్ నెలాఖరు వరకు పెద్దఎత్తున వన మహోత్సవ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు వినయ్ కుమార్ తెలిపారు. మంగళవారం ఒక్కరోజే రాష్ట్రవ్యాప్తంగా లక్ష మొక్కలు నాటే లక్ష్యంతో కార్యక్రమాలు చేపట్టినట్లు వెల్లడించారు.
మొక్కలు నాటడం ప్రభుత్వ శాఖలకే పరిమితమైన కార్యక్రమం కాదని, ప్రజలందరి భాగస్వామ్యంతోనే పచ్చదనం విస్తరిస్తుందని ఆయన అన్నారు. ప్రతి కుటుంబం, ప్రతి విద్యార్థి, ప్రతి పౌరుడు కనీసం ఒక మొక్కను నాటి దాని సంరక్షణకు పూనుకోవాలని కోరారు. ముఖ్యంగా విద్యార్థులు తమ పుట్టినరోజు వేడుకలను మొక్క నాటడంతో ప్రారంభించి, ఆ మొక్కను తమ మిత్రుడిలా భావించి పెంచాలని సూచించారు. మొక్క నాటిన వెంటనే బాధ్యత ముగియదని, దానికి నీరు పోసి, పశువుల నుంచి కాపాడుతూ పెరిగే వరకు సంరక్షించడమే నిజమైన ప్రకృతి సేవ అని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో చార్మినార్ వలయ ప్రధాన అటవీ సంరక్షణాధికారి డా. ప్రియాంక వర్గీస్, అదనపు కలెక్టర్ కె. చంద్రారెడ్డి, జిల్లా అటవీ అధికారి శివ్ ఆశీష్ సింగ్, అటవీశాఖ అధికారులు, పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజ్ఞ మృతికి బీజేపీ నేతలు సంతాపం



**హైదరాబాద్:** ఈ రోజు డీడీ కాలనీలో బీజేపీ రాష్ట్ర కార్యాలయ కార్యదర్శి డాక్టర్ ఉమాశంకర్ గారి కుమార్తె ప్రజ్ఞ ఇటీవల పరమపదించిన నేపథ్యంలో, వారి నివాసానికి వెళ్లిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చందుపట్ల కీర్తి రెడ్డి గారు, జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు ఏడు నూతుల నిషీధర్ రెడ్డి గారు కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రజ్ఞ మృతికి సంతాపం తెలిపారు.ప్రజ్ఞ ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని వారు ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జన్నే మొగిలి గారు, జిల్లా ప్రధాన కార్యదర్శులు తాడికొండ రవికిరణ్ గారు, పెండ్యాల రాజు గారు, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు సయ్యద్ గాలిఫ్ గారు, బీజేవైఎం నాయకులు లాడే శివకుమార్ గారు, మై భారత్ జిల్లా కన్వీనర్ ఎర్ర రాకేష్ రెడ్డి గారు తదితరులు పాల్గొన్నారు.

# చిన్న రావిరాలలో వన మహోత్సవం.. పచ్చదనానికి శ్రీకారం

**హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఆగస్టు 25:-**



రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం చిన్నరావిరాల గ్రామంలో వన మహోత్సవ కార్యక్రమం ఉత్సాహభరితంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ పబ్బత్ బాలకిషన్ గౌడ్ ఆధ్వర్యంలో గ్రామ పరిసరాల్లో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రతిజ్ఞ చేశారు. పచ్చదనం పెంపొందించడంతో పాటు భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించాలనే సంకల్పంతో మొక్కలు నాటినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ బాలకిషన్ గౌడ్ మాట్లాడుతూ.. మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు. నాటిన మొక్కలను కేవలం కార్యక్రమానికే పరిమితం చేయకుండా వాటిని సంరక్షించి, వృక్షాలుగా ఎదిగేలా చూడాలని సూచించారు. పచ్చని చెట్లు గ్రామానికి ప్రకృతి అందాన్ని తీసుకురావడమే కాకుండా స్వచ్ఛమైన గాలి, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందిస్తాయని పేర్కొన్నారు.వన మహోత్సవంలో భాగంగా గ్రామంలోని వివిధ ప్రాంతాల్లో మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణపై అవగాహన కల్పించారు. ప్రతి కుటుంబం మొక్కలను నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సద్దిపల్లి శిరీష శంకర్ రెడ్డి, వార్డు సభ్యులు ఆకిటి రామకృష్ణారెడ్డి, బండారి సత్యనారాయణ, రాపోలు మల్లేష్, గ్రామ కార్యదర్శి సునీతతో పాటు ఉపాధి హామీ కూలీలు పాల్గొని మొక్కలు నాటారు. గ్రామంలో పచ్చదనాన్ని విస్తరించేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని వారు కోరారు.

# వన మహోత్సవంలో భాగంగా మొక్కలను నాటిన పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి



పరకాల పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో వన మహోత్సవంలో భాగంగా పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి గ మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...పర్యావరణ పరిరక్షణతో పాటు భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలని అన్నారు.ప్రతి గ్రామంలో విస్తృతంగా మొక్కలు నాటి, వాటిని సంరక్షించే విధంగా ప్రజల్లో అవగాహన కల్పించాలని అన్నారు.

RNI No Tel / 2012 /4241
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in



# అర్హులైన కుటుంబాలకు స్మార్ట్ రేషన్ కార్డులు గొర్రెకుంటలో లబ్ధిదారులకు కార్డులు పంపిణీ



**గీసుకొండ, ఆగష్టు 25 హైదరాబాద్ ఎస్టేట్:**

గీసుగొండ మండలంలోని గొర్రెకుంట గ్రామంలో అర్హులైన కుటుంబాలకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పరిపాలన అధికారి గద్దల రాజు లబ్ధిదారులకు కార్డులను అందజేశారు. అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు అందేలా ప్రభుత్వం చేపడుతున్న ప్రక్రియలో భాగంగా గ్రామంలో కార్డుల పంపిణీ చేపట్టారు. రేషన్ కార్డులతో అర్హులైన కుటుంబాలకు ఆహార భద్రతతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందనున్నాయని నాయకులు తెలిపారు. అర్హత ఉన్న కుటుంబాలు తమ వివరాలను సంబంధిత అధికారులకు సమర్పించి ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం రేషన్ కార్డులు పొందాలని సూచించారు. కార్యక్రమంలో గొర్రెకుంట మాజీ సర్పంచ్ జను రేణుక, మాజీ ఎంపీటీసీ సభ్యుడు పోలేపాక సుమన్, కాంగ్రెస్ 15వ డివిజన్ అధ్యక్షుడు కందుల అశోక్, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొండేటి కొమురారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ల్యాదల సంపత్, కాంటెస్ట్ కార్పొరేటర్ ఎలగొండ ప్రవీణ్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# రావిరాల గ్రామంలో నూతన ఎమ్మార్పీఎస్ ( ఎమ్మార్పీఎస్ ) కమిటీ ఎన్నిక...



**( హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి ఆగస్ట్ 25:)**

మహేశ్వరం/రావిరాల: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు, రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం రావిరాల గ్రామంలో ఎమ్మార్పీఎస్ ( ఎమ్మార్పీఎస్ ) నూతన గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రంగారెడ్డి జిల్లాలోని ప్రతి మండలంలోనూ గ్రామ కమిటీలను ఏర్పాటు చేస్తూ, మండల కమిటీల పునర్నిర్మాణంలో భాగంగా ఈరోజు రావిరాల దండోరా కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మార్పీస్ మాజీ జిల్లా అధ్యక్షులు రావుగళ్ళ బాబు మాదిగ, మాజీ మండల అధ్యక్షులు ఎర్ర గణేష్ మాదిగ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. నూతన గ్రామ కమిటీ వివరాలు: అధ్యక్షులు: ఆలేటి వెంకటేష్ మాదిగ అధికార ప్రతినిధి: జోగు శివరాజ్ మాదిగ ప్రధాన కార్యదర్శులు: జోగు సుమన్ మాదిగ, బైండ్ల స్వామి మాదిగ ఉపాధ్యక్షులు: రెడ్డిగళ్ళ దేవేందర్ మాదిగ, ఆలేటి రమేష్ మాదిగ, ఎర్రోళ్ల శ్రీధర్ కోశాధికారి: కొటగళ్ల విజయ్కార్యదర్శులు: నేదునూరి రఘు, రావుగళ్ళ శ్రీధర్ మాదిగ, కొంగరి వెంకటేష్, పొట్టోళ్ల సుధాకర్ సహాయ కార్యదర్శులు: ఆలేటి కార్తీక్, బుస్సగారి మహేందర్, మంకాల సురేందర్, కిన్నరి ప్రవీణ్ కార్యవర్గ సభ్యుడు: కూటగళ్ల ప్రవీణ్ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు మరియు మాదిగ కుల పెద్దలు పొట్టోల్ల నరసింహ, కోటగళ్ల బాలరాజ్, కోటగళ్ల సుధాకర్, కిన్నరి రాజు, డప్పు యాదయ్య, రావుగళ్ళ దయానంద్, ఆలేటి శ్రీను, రావుగళ్ళ జంగయ్య, ఆలేటి జగన్, కిన్నరి ధనరాజ్, ఆకంపల్లి యాదయ్య, రావుగళ్ళ అమరేందర్, బాట శ్రీను, బాట ఆనంద్, రావుగళ్ళ నరసింహ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# హోంమంత్రి అమిత్ షా రాజీనామా చేయాలి యూత్ కాంగ్రెస్ ధర్నా పాల్గొన్న దేప భాస్కర్ రెడ్డి

## మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డిపిసిసి సభ్యులు దేప భాస్కర్ రెడ్డి



**( హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి ఆగస్టు 24:)**

రంగారెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు నాగేందర్ రెడ్డి, మహేశ్వరం నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సుభాన్ యాదవ్, ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు శివ చరణ్ రెడ్డి మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు, టీపీసీసీ సభ్యులు దేప భాస్కర్ రెడ్డి, పాల్గొన్నారు. అనంతరం హోంమంత్రి అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేసి, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారుఈ సందర్భంగా దేప భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్‌ను తీవ్రంగా ఖండించారు. విద్యార్థుల సమస్యలపై కేంద్ర ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ఈ ఘటనకు బాధ్యత వహిస్తూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు,ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# సీఎంఆర్ డెలివరీలు వేగవంతం చేయాలి

**హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఆగస్టు 25:-**

రంగారెడ్డి జిల్లా: ఖరీఫ్, రబీ 202526 సంవత్సరాలకు సంబంధించిన కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) డెలివరీలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రా రెడ్డి కస్టమ్ మిల్లర్లను ఆదేశించారు. మంగళవారం కస్టమ్ మిల్లర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో సీఎంఆర్ డెలివరీల పురోగతిపై ఆయన వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల మేరకు పెండింగ్‌లో ఉన్న సీఎంఆర్ బియ్యం డెలివరీలను ఎలాంటి జాప్యం లేకుండా పూర్తి చేయాలని సూచించారు. ముఖ్యంగా రా సీఎంఆర్‌ను భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ)కి చేరవేయడాన్ని అత్యంత ప్రాధాన్యతగా తీసుకోవాలని స్పష్టం చేశారు. మిల్లుల్లో నిల్వ ఉన్న బియ్యాన్ని వెంటనే డెలివరీ చేసి, నిర్దేశిత గడువులోగా ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. సీఎంఆర్ డెలివరీలో జాప్యం వల్ల ప్రభుత్వానికి ఇబ్బందులు తలెత్తకుండా మిల్లర్లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని చంద్రా రెడ్డి సూచించారు. ప్రతి మిల్లుకు కేటాయించిన లక్ష్యాలు, ఇప్పటివరకు పూర్తయిన డెలివరీలు, ఇంకా మిగిలి ఉన్న పరిమాణంపై అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షించాలని ఆదేశించారు. పెండింగ్ నిల్వలపై ప్రత్యేక దృష్టి సారించి, రోజువారీగా పురోగతిని పర్యవేక్షించాలని సూచించారు. సీఎంఆర్ ప్రక్రియను సకాలంలో పూర్తి చేసేందుకు మిల్లర్లు, సంబంధిత



శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో డీసీఎస్ఓ వనజాత, డీఎంసీఎస్ హరీష్, సంబంధిత శాఖల అధికారులు, కస్టమ్ మిల్లర్లు పాల్గొన్నారు.

# డ్రగ్స్ నిర్మూలనకు సమష్టి పోరాటం

**హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఆగస్టు 25:-**

హైదరాబాద్: మాదకద్రవ్య రహిత భారత్ నిర్మాణమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'నషా ముక్త్ భారత్ అభియాన్'పై హైదరాబాద్ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా మహేశ్వరంలో 'వార్త' మీడియా వర్క్‌షాప్ నిర్వహించారు. మాదకద్రవ్యాల నియంత్రణలో మీడియా పాత్ర, బాధ్యతాయుతమైన వార్తా కథనాలపై జర్నలిస్టులకు అవగాహన కల్పించారు.

కార్యక్రమాన్ని మహేశ్వరం జోన్ డీసీపీ కె. నారాయణ రెడ్డి (ఐపీఎస్) ప్రారంభించారు. ఈగల్ ఫోర్స్ ఎస్పీ రావుల గిరిధర్ (ఐపీఎస్), పీఐబీ హైదరాబాద్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ మానస్ కృష్ణకాంత్, మహేశ్వరం ఎంపీడీవో ఎన్. శారదమ్మ పాల్గొన్నారు. డీసీపీ నారాయణ రెడ్డి మాట్లాడుతూ డ్రగ్స్ నియంత్రణకు చట్టపరమైన చర్యలతో పాటు ప్రజల భాగస్వామ్యం అత్యవసరమన్నారు. మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై తల్లిదండ్రులు, విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. యువతను మత్తు పదార్థాలకు దూరంగా ఉంచడం శాంతిభద్రతలకే కాకుండా వారి భవిష్యత్తుకు సంబంధించిన అంశమని పేర్కొన్నారు.

ఈగల్ ఫోర్స్ ఎస్పీ గిరిధర్ మాట్లాడుతూ తెలంగాణలో జనవరి నుంచి సుమారు 8 వేల కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. 22 రకాల శిక్షణ కార్యక్రమాల ద్వారా 30 వేల మందికి పైగా పోలీసు, ఇతర శాఖల సిబ్బందికి అవగాహన కల్పించినట్లు వివరించారు. మాదకద్రవ్యాల కేసులపై వార్తలు రాసేటప్పుడు కచ్చితత్వం, సున్నితత్వం పాటించాలని, మైనర్ల వివరాలను గోప్యంగా ఉంచాలని మీడియా ప్రతినిధులకు సూచించారు.



పీఐబీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ మానస్ కృష్ణకాంత్ మాట్లాడుతూ వాస్తవాధారిత సమాచారంతో బాధ్యతాయుతమైన రిపోర్టింగ్‌కు జర్నలిస్టులను సిద్ధం చేయడమే వర్క్‌షాప్ ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో సుమారు 60 మంది మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

# గ్రేవ్ కేసుల దర్యాప్తులో నాణ్యతతో పాటు వేగం ఉండాలి

## : జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా, ఐపీఎస్

**హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి వికారాబాద్**

జిల్లా పోలీస్ కార్యాలయంలో వికారాబాద్ జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా, ఐపీఎస్ గారు జిల్లాలోని ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులతో గ్రేవ్ కేసులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ గారు జిల్లాలో నమోదైన గ్రేవ్ కేసులకు సంబంధించిన కేసు ఫైల్స్‌ను క్షుణ్ణంగా పరిశీలించి, ప్రతి కేసులో ఇప్పటివరకు జరిగిన దర్యాప్తు పురోగతి, సేకరించిన ఆధారాలు, సాక్షుల వాంగ్మూలాలు, నిందితుల గుర్తింపు, అరెస్టులు, పెండింగ్‌లో ఉన్న దర్యాప్తు అంశాలు తదితర వివరాల గురించి అధికారులకు అడగడం జరిగింది. ప్రతి గ్రేవ్ కేసులో దర్యాప్తు అధికారులు కేసు యొక్క అన్ని కోణాలను పరిశీలించి, శాస్త్రీయ మరియు సాంకేతిక ఆధారాలను సమర్థవంతంగా సేకరించాలని ఎస్పీ గారు సూచించారు. కేసు దర్యాప్తులో ఎలాంటి జాప్యం లేకుండా, ఆధారాలను పకడ్బందీగా సేకరించి, నిందితులకు శిక్ష పడే విధంగా దర్యాప్తును నాణ్యతతో పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే కేసుల దర్యాప్తులో CCTNS, e`Sakshya, CDR/IPDR, CCTV ఫుటేజ్, డిజిటల్ మరియు ఇతర సాంకేతిక ఆధారాలను అవసరమైన మేరకు వినియోగించాలని సూచించారు. నేర స్థల పరిశీలన, సాక్షుల విచారణ, ఫోరెన్సిక్ ఆధారాల సేకరణ వంటి అంశాల్లో ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న గ్రేవ్ కేసులను ప్రాధాన్యతా క్రమంలో తీసుకుని, ప్రతి కేసులో తదుపరి దర్యాప్తు చర్యలకు స్పష్టమైన ప్రణాళిక రూపొందించుకోవాలని ఎస్పీ గారు అధికారులను ఆదేశించారు. దర్యాప్తులో ఎదురవుతున్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి, అవసరమైన సాంకేతిక మరియు న్యాయపరమైన సహకారంతో కేసులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. అదేవిధంగా కోర్టు ట్రయల్‌కు వెళ్లే కేసుల్లో చార్జ్‌షీట్‌లను నాణ్యతతో సిద్ధం చేయడం, కోర్టు సమన్లు మరియు వారెంట్ల అమలు, సాక్షుల హాజరు, ప్రాసిక్యూషన్‌తో సమన్వయం వంటి అంశాలపై కూడా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ గారు సూచించారు. "ప్రతి గ్రేవ్ కేసును అత్యంత ప్రాధాన్యతతో తీసుకుని,



బాధితులకు న్యాయం జరిగేలా సమర్థవంతమైన దర్యాప్తు చేయాలి. నేరస్తులకు చట్టప్రకారం శిక్ష పడే విధంగా కేసులను పకడ్బందీగా దర్యాప్తు చేయాలి" అని జిల్లా ఎస్పీ గారు అధికారులకు సూచించారు.

ఈ సమీక్షా సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ శ్రీ రాజేశ్ మీనా,IPS గారు, DCRB DSP జానయ్య, DTC DSP శ్రీనివాస్, జిల్లాలోని ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# పాపన్నపేట ఎఫ్ సి ఐ గోదాం ఇంచార్జి ఇష్టారాజ్యం... !

## - గడువు ముగుస్తున్న రేషన్ డీలర్లకు పంపిణీ చేయని పిడిఎస్ బియ్యం...!!

## - గ్రామాలలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రేషన్ డీలర్లు ...!!!?

**మెదక్,ఆగస్టు25 (హైద్రాబాద్ ఎస్టేట్):**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తెలుపు రేషన్ కార్డులు కలిగిన లబ్ధిదారులకు ఆగస్టు,సెప్టెంబర్,అక్టోబర్ మూడు నెలల బియ్యాన్ని పంపిణీ చేయాలని రేషన్ డీలర్ లను ఆదేశించినప్పటికీ, అధికారుల నిర్లక్ష్యం మూలంగా ఇప్పటి వరకు కొన్ని గ్రామాలకు చెందిన రేషన్ డీలర్లకు బియ్యం పంపిణీ కాక పోవటంతో రేషన్ కార్డు దారులు ఆకలితో అలమటిస్తున్నారు. పాపన్నపేట మండల కేంద్రంలో (ఎంఎల్ఎస్ పాయింట్)ఎఫ్ సి ఐ ఉంది. ఇక్కడి గోదాం నుండి పాపన్నపేట, టేక్మాల్ మండలాలకు చెందిన రేషన్ డీలర్లకు బియ్యం పంపిణీ జరుగుతుంది. కాగా మూడు నెలల రేషన్ బియ్యం పంపిణీకి ప్రభుత్వం ఆగస్టు 31 తేదీ లోగా బియ్యం పంపిణీ చేయాలని జిల్లా పౌర సరఫరాల అధికారులు సూచించినప్పటికీ ఇక్కడ పని చేస్తున్న గోదాం ఇంచార్జి నరసింహ రావు మాత్రం తమకు పట్టనట్లుగా వ్యవహరిస్తూ, తమకు నచ్చిన గ్రామాలకు చెందిన రేషన్ డీలర్లకు బియ్యాన్ని సరఫరా చేస్తున్నారని కొందరు రేషన్ డీలర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గడువు సమీపిస్తున్నప్పటికీ



పూర్తిస్థాయిలో బియ్యాన్ని తమ షాపులకు పంపిణీ చేయకపోవటంతో తాము గ్రామాలలో రేషన్ కార్డు దారుల నుండి ఆగ్రహానికి గురవుతున్నారని డీలర్లు తెలిపారు. ఇదంతా ఒకవంతు కాగా,లారీలలో వచ్చిన బియ్యాన్ని గోదాం ఇంచార్జి బియ్యం బస్తాలను తూకం వేయకుండానే తమ తమ షాపులకు పంపిణీ చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. దీనితో 50కిలోలు ఉండాల్సిన ఒక్కో బియ్యం బ్యాగులో ఒక కిలో నుండి రెండు కిలోల వరకు బియ్యం తక్కువగా వస్తున్నాయని డీలర్లు అవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులు స్పందించి రేషన్ డీలర్లకు



సకాలంలో,బియ్యం తూకం వేసి పంపించాలని కోరుతున్నారు. ఈవిషయమై పాపన్నపేట గోదాం ఇంచార్జి నరసింహ రావు ను వివరణ కోరగా ఇందులో తమ పొరపాటు ఏం లేదని వివరణ ఇచ్చారు.

RNI No Tel / 2012 /4241
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in



# ఫీజు బకాయి బిజెపి లడాయి నిరాహార దీక్షలో పాల్గొన్న మెదక్ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు బైండ్ల సత్యనారాయణ

**మెదక్,ఆగస్టు25(హైద్రాబాద్ ఎస్టేట్):**

భారతీయ జనతా పార్టీ(బీజేపీ) రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు తలపెట్టిన ఫీజు బకాయి బీజేపీ లడాయి కార్యక్రమంలో మెదక్ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు బైండ్ల సత్యనారాయణ ముదిరాజ్ పాల్గొని సంఘీభావం తెలిపినట్లు ఆయన పేర్కొన్నారు. దీక్షలో కిసాన్ మోర్చా కమిటీ సభ్యులు పూర్తి స్థాయిలో పాల్గొన్నట్లు ఆయన వివరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే స్పందించి విద్యార్థులకు బకాయిలు విడుదల చేయవలసిందిగా డిమాండ్ చేస్తున్నామన్నారు.

లేని ఎడల బిజెపి పార్టీ తరఫున పెద్ద ఎత్తున ఉద్యమం చేయడం జరుగుతుందనీ ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా కిసాన్ మోర్చా జిల్లా కమిటీ జనరల్ సెక్రటరీ ఆకుల ప్రభాకర్, శ్యామ్,రమేష్, ఉపాధ్యక్షుడు రాజు, శ్రీనివాస్ రెడ్డి,కార్యవర్గ సభ్యులు చంద్రన,కార్తీక్ మండల కిసాన్ మోర్చా అధ్యక్షులు బాల్ లింగం,శ్రీకాంత్ మెదక్ పట్టణ కిసాన్ మోర్చా అధ్యక్షులు గోవిందరాజు,దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



# చిన్న రావిరాలలో వన మహోత్సవం.. పచ్చదనానికి శ్రీకారం

**హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఆగస్టు 25:-**



రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం చిన్నరావిరాల గ్రామంలో వన మహోత్సవ కార్యక్రమం ఉత్సాహభరితంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ పబ్బత్ బాలకిషన్ గౌడ్ ఆధ్వర్యంలో గ్రామ పరిసరాల్లో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రతిజ్ఞ చేశారు. పచ్చదనం పెంపొందించడంతో పాటు భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించాలనే సంకల్పంతో మొక్కలు నాటినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ బాలకిషన్ గౌడ్ మాట్లాడుతూ.. మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు. నాటిన మొక్కలను కేవలం కార్యక్రమానికే పరిమితం చేయకుండా వాటిని సంరక్షించి, వృక్షాలుగా ఎదిగేలా చూడాలని సూచించారు. పచ్చని చెట్లు గ్రామానికి ప్రకృతి అందాన్ని తీసుకురావడమే కాకుండా స్వచ్ఛమైన గాలి, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందిస్తాయని పేర్కొన్నారు.

వన మహోత్సవంలో భాగంగా గ్రామంలోని వివిధ ప్రాంతాల్లో మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణపై అవగాహన కల్పించారు. ప్రతి కుటుంబం మొక్కలను నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సద్దిపల్లి శిరీష శంకర్ రెడ్డి, వార్డు సభ్యులు ఆకిటి రామకృష్ణారెడ్డి, బండారి సత్యనారాయణ, రాపోలు మల్లేష్, గ్రామ కార్యదర్శి సునీతతో పాటు ఉపాధి హామీ కూలీలు పాల్గొని మొక్కలు నాటారు. గ్రామంలో పచ్చదనాన్ని విస్తరించేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని వారు కోరారు.

# ఫీజు బకాయిల విడుదలకు బీజేపీ పోరుబాట

**హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఆగస్టు 25:-**

తెలంగాణలో పెండింగ్‌లో ఉన్న రూ.15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు చేపట్టిన రెండు రోజుల నిరాహార దీక్ష విజయవంతంగా ముగిసింది. నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన ఈ దీక్షకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షుడు రాజ్ భూపాల్ గౌడ్, జీహెచ్ఎంసీ 53, 56 డివిజన్ల అధ్యక్షుడు ఎలిమినేటి నరసింహారెడ్డి పాల్గొని దీక్షకు మద్దతు ప్రకటించారు.

ఈ సందర్భంగా రాంచందర్ రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. బకాయిలు విడుదల కాకపోవడంతో పేద, దళిత, బీసీ, మైనార్టీ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కళాశాలల నుంచి ధ్రువపత్రాలు పొందలేక ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజుల బకాయిబీజేపీ లడాయి' నినాదంతో విద్యార్థుల సమస్యలపై రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. విద్యార్థులకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదని హెచ్చరించారు. రాంచందర్ రావు దీక్షకు 53, 56 డివిజన్ల నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు, విద్యార్థులను సమీకరించి మద్దతు ఇస్తామని నరసింహారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, ఎమ్మెల్యేలు, బీజేవైఎం నేతలు, కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.



# కార్మికకర్షక ఐక్యతకు సారంపల్లి మల్లారెడ్డి స్ఫూర్తి

**హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఆగస్టు 25:-**

వనస్థలిపురం: కార్మికులు, కర్షకులు ఐక్యంగా పోరాడితేనే దోపిడీ లేని సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని చాటిచెప్పిన కమ్యూనిస్టు ఉద్యమ యోధుడు కామ్రేడ్ సారంపల్లి మల్లారెడ్డి అని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య కొనియాడారు. సోమవారం నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సారంపల్లి మల్లారెడ్డి మృతి చెందడంతో మంగళవారం వనస్థలిపురం రైతుబజార్ చౌరస్తాలో చిరు వ్యాపారులు, కార్మికులతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఆలేటి ఎల్లయ్య మాట్లాడుతూ.. అఖిల భారత కిసాన్ సభ ఉపాధ్యక్షుడిగా సారంపల్లి మల్లారెడ్డి రైతులు, కార్మికుల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడారని తెలిపారు. రాష్ట్రంలోని వివిధ ప్రాజెక్టులు, రిజర్వాయర్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి, వాటిపై సమగ్ర అధ్యయనం చేసి ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకొచ్చారని అన్నారు.

కలుషిత పరిశ్రమలకు వ్యతిరేకంగా పర్యావరణ పరిరక్షణ కోసం అనేక పోరాటాలు నిర్వహించడంతో పాటు కార్మికుల హక్కుల కోసం దేశవ్యాప్తంగా జరిగిన సార్వత్రిక సమ్మెలు, జైల్‌భరో వంటి ఉద్యమాల్లో చురుకుగా పాల్గొన్నారని గుర్తుచేశారు. భూస్వాముల దోపిడీ, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా అట్టడుగు వర్గాల ప్రజలకు అండగా నిలిచి భూ పోరాటాలు నిర్వహించారని పేర్కొన్నారు. నిబద్ధత, నిజాయితీతో పనిచేసిన మల్లారెడ్డి యువతను ఉద్యమాల వైపు నడిపించారని అన్నారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ కార్మికులు, కర్షకులు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. మల్లారెడ్డి కుటుంబ సభ్యులకు సీఐటీయూ, సీపీఎం తరఫున ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పొట్టేపాక రామస్వామి, తెలంగాణ మత్స్యకారుల, మత్స్య కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి తడబోయిన కృష్ణమూర్తి, జీహెచ్ఎంసీ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాస్, చిరు వ్యాపారుల సంఘం అధ్యక్షురాలు అబ్బ భారతమ్మ, సహాయ కార్యదర్శి వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



# పేరుకే ఫిల్టర్ కాఫీ అందులో మాత్రం బొద్దింకలు

**హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఆగస్టు 25:-**

జీహెచ్ఎంసీ ఆదిభట్ల సర్కిల్ పరిధిలోని మన్నెగూడలో చెన్నపట్నం ఫిల్టర్ కాఫీ సెంటర్‌లో సోమవారం రోజున కస్టమర్‌కు అందించిన బ్లాక్ కాఫీలో బొద్దింక కనిపించడం కలకలం రేపింది. కస్టమర్ తెలిపిన వివరాల ప్రకారం.. బ్లాక్ కాఫీ ఆర్డర్ చేసి తాగుతున్న సమయంలో ఎలాంటి అనుమానం రాలేదని, కాఫీ పూర్తిగా తాగిన అనంతరం కప్పు అడుగున బొద్దింక కనిపించడంతో షాక్‌కు గురైనట్లు తెలిపారు. ఈ విషయంపై హోటల్ సిబ్బందిని ప్రశ్నించగా, కాఫీ సెంటర్‌ను పరిశుభ్రంగానే నిర్వహిస్తున్నామని నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారని కస్టమర్ ఆరోపించారు. హోటళ్లలో ధరలు పెంచడంపై చూపుతున్న శ్రద్ధ.. వినియోగదారులకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందించడంపై ఎందుకు ఉండటం లేదని ఆయన ప్రశ్నించారు.

బొద్దింకకు బదులు కాఫీలో బల్లి వంటి ప్రమాదకరమైన జీవి పడి ఉంటే పరిస్థితి ఎలా ఉండేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఒకవైపు ఆహార పదార్థాల ధరలు పెంచుతూ మరోవైపు ప్రజల ఆరోగ్యం, ప్రాణాలతో చెలగాటం ఆడేలా నిర్లక్ష్యం వహిస్తే ఎలా అంటూ వినియోగదారులు మండిపడుతున్నారు. చాయ్ అయినా.. కాఫీ అయినా.. డబ్బుల మీద ఉన్న శ్రద్ధ ప్రజల ప్రాణాల మీద లేకపోతే ఇలాంటి ఘటనలు పునరావృతమయ్యే ప్రమాదం ఉంది. ఇలాంటి ఘటన వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో సంబంధిత ఫుడ్ సేఫ్టీ, శానిటేషన్ అధికారులు వెంటనే స్పందించి చెన్నపట్నం ఫిల్టర్ కాఫీ సెంటర్‌తో పాటు పరిసర ప్రాంతాల్లోని హోటళ్లు, కాఫీ సెంటర్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. ఆహార నాణ్యత, పరిశుభ్రత ప్రమాణాలు పాటిస్తున్నారా లేదా పరిశీలించి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అధికారులు స్పందించి ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా తక్షణ చర్యలు తీసుకుంటారా? అన్నది వేచి చూడాలి.



# పచ్చదనమే లక్ష్యం..

## కోర్టు ప్రాంగణంలో మొక్కల నాటకం

**హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఆగస్టు 25:-**



**ఇబ్రహీంపట్నం:** వనమహోత్సవం2026లో భాగంగా ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో కోర్టు ప్రాంగణంలో సామూహిక మొక్కల నాటే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడం, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం సీనియర్ సివిల్ జడ్జి రీటా లాల్చంద్, అదనపు సివిల్ జడ్జి ముకేష్ రానా మాంచి, జూనియర్ సివిల్ జడ్జి మారుతి ప్రసాద్ పాల్గొని మొక్కలు నాటారు. పచ్చదనం పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, మొక్కలను నాటడంతో పాటు వాటిని సంరక్షించేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని వారు సూచించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్, బార్ అసోసియేషన్ సభ్యులు, వార్డు అధికారులు, ఎస్ఐ, ఈఈతో పాటు మున్సిపల్ సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. కోర్టు ప్రాంగణంలో వివిధ రకాల మొక్కలను నాటి, వాటి సంరక్షణకు అవసరమైన చర్యలు చేపట్టారు. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలో పచ్చదనాన్ని విస్తరించడంతో పాటు పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు వనమహోత్సవ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తేనే పచ్చని, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

# ఉప సర్పంచ్‌ల గళానికి కొత్త బలం





ఉప సర్పంచుల సంఘం
తెలంగాణ రాష్ట్రం

నియామక పత్రం

శ్రీ లావుడ్య రాములు నాయక్
వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు
తెలంగాణ ఉపసర్పంచుల సంఘం

**హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఆగస్టు 25:-**

యాచారం: తెలంగాణ రాష్ట్ర ఉప సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర కార్యదర్శిగా రంగారెడ్డి జిల్లా యాచారం మండలం కొత్తపల్లి గ్రామ ఉప సర్పంచ్ కాలె అనితరమేష్ నియమితులయ్యారు. హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు లావుడ్య రాములు నాయక్ ఆమెకు నియామక ఉత్తర్వులు అందజేసి బాధ్యతలు అప్పగించారు.

ఈ సందర్భంగా కాలె అనితరమేష్ మాట్లాడుతూ తనపై విశ్వాసం ఉంచి కీలక బాధ్యతలు అప్పగించిన లావుడ్య రాములు నాయక్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలోని ఉప సర్పంచ్‌లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. ఉప సర్పంచ్‌లకు దక్కాల్సిన హక్కులు, అధికారాలు, గౌరవం, సంక్షేమం వంటి అంశాలపై ప్రభుత్వ దృష్టికి సమస్యలను తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. గ్రామస్థాయిలో ఉప సర్పంచ్‌లను ఏకతాటిపైకి తీసుకువచ్చి సంఘాన్ని మరింత బలోపేతం చేస్తానన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఉప సర్పంచ్‌లను సమన్వయం చేసి, వారి సమస్యలపై ఐక్యంగా పోరాడేందుకు కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. కొత్తపల్లి గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు, ఉప సర్పంచ్‌లు ఆమె నియామకంపై హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

# విద్యార్థుల సమస్యలకు పరిష్కారం చూపాలి

## ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డికి ఎస్ఎఫ్ఐ వినతి

**పరకాల, ఆగస్టు 25 హైదరాబాద్ ఎస్టేట్:**



పట్టణంలోని ప్రభుత్వ విద్యాసంస్థల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ పరకాల పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కళ్యాణ్ మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవసరమైన మరుగుదొడ్లు, స్నానపు గదులు నిర్మించాలని, కళాశాల ప్రధాన గేటు వద్ద అటెండర్‌ను నియమించాలని కోరారు. పరకాల పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కొరతను పరిష్కరించి విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని కోరారు. విద్యార్థుల్లో క్రీడా ప్రతిభను ప్రోత్సహించేందుకు పరకాల పట్టణంలో మినీ స్టేడియం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవడంతో పాటు ఆయా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని ఎమ్మెల్యేను కోరినట్లు కళ్యాణ్ తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పరకాల పట్టణ అధ్యక్షుడు బొజ్జ హేమంత్, మండల అధ్యక్షుడు కోగిల సాయితేజ, మండల ఉపాధ్యక్షుడు కొమ్ముల రాహుల్, శివ, భరత్, సన్నీ, మహేష్, సందీప్, జస్వంత్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో ఫ్రీగా కుట్టుమిషన్లు..

## దరఖాస్తులకు కొన్నిరోజులే!




బీసీ మహిళల కోసం ఇంటింటా ఇందిరమ్మ కుట్టు మిషన్ల పథకం ప్రారంభం

రాష్ట్రవ్యాప్తంగా 1.19 లక్షల ఆటోమేటిక్ కుట్టు మిషన్ల ఉచిత పంపిణీ

ఆగస్టు 15 నుంచి సెప్టెంబర్ 15 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

18-55 ఏళ్ల వయసు, నిర్దిష్ట ఆదాయ పరిమితి ఉన్న బీసీ మహిళలు అర్హులు

మహిళల ఆర్థిక స్వావలంబన, ఉపాధి కల్పనే ప్రభుత్వ లక్ష్యం

# అభివృద్ధి పనులపై క్షేత్రస్థాయి పరిశీలన

## నాలుగు గ్రామాల్లో పర్యటించిన అదనపు కలెక్టర్..

## వనమహోత్సవంలో ఎమ్మెల్యే రేవూరి

**గీసుకొండ, ఆగష్టు 25 హైదరాబాద్ ఎస్టేట్:**



మండలంలోని పలు గ్రామాల్లో కొనసాగుతున్న అభివృద్ధి, పారిశుద్ధ్య కార్యక్రమాల అమలును అదనపు కలెక్టర్ ఎల్‌బీ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కొమ్మాల గ్రామంలో నిర్వహించిన ప్రత్యేక వనమహోత్సవ కార్యక్రమంలో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డితో కలిసి పాల్గొని మొక్కలు నాటారు. అనంతరం కొమ్మాల గ్రామంలో పైకప్పులపై సేకరించే వర్షపు నీటి నిర్మాణాలు, మ్యాజిక్ సోక్‌పిట్లు, స్వచ్ఛభారత్ మిషన్‌లో భాగంగా సామూహిక మరుగుదొడ్ల నిర్మాణానికి గుర్తించిన ప్రదేశాలను అదనపు కలెక్టర్ పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రంలో మధ్యాహ్న భోజన ఏర్పాట్లను తనిఖీ చేసి వివరాలు తెలుసుకున్నారు. కొమ్మాలతో పాటు నందనాయక్‌తండా, విశ్వనాథపురం, గంగాదేవిపల్లి గ్రామాల్లోనూ పర్యటించారు. ఆయా గ్రామాల్లో చేపడుతున్న పారిశుద్ధ్య కార్యక్రమాలు, మౌలిక సదుపాయాలు, ప్రభుత్వ కార్యక్రమాల అమలు తీరును పరిశీలించి సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపునకు ప్రాధాన్యం ఇవ్వాలని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి సూచించారు. నాటిన మొక్కల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, మండల ప్రత్యేక అధికారి, తహసీల్దార్, ఏపీవో, ఈసీ, సాంకేతిక సహాయకులు, అటవీశాఖ బీట్ అధికారి, పంచాయతీ కార్యదర్శులు, క్షేత్ర సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బస్సు డ్రైవర్లకు ప్రత్యేక శిక్షణ..

## ప్రమాదాల నివారణే లక్ష్యం

**హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఆగస్టు 25:-**



**షాద్‌నగర్:** రోడ్డు ప్రమాదాలను తగ్గించి వాహనదారుల భద్రతను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ఫ్యూచర్ సిటీ ట్రాఫిక్ పోలీసులు చర్యలకు శ్రీకారం చుడుతున్నారు. ఇందులో భాగంగా చీూజా సంస్థలో ట్రాఫిక్ శిక్షణ సంస్థ (ట×) ఏర్పాటు చేసే అంశంపై ఫ్యూచర్ సిటీ ట్రాఫిక్ డీసీపీ శ్రీ శివం ఉపాధ్యాయ్, ఖూా సంస్థ ప్రతినిధులతో ప్రత్యేకంగా చర్చించారు. చీూజా సంస్థను సందర్శించిన డీసీపీ.. ట్రాఫిక్ నిర్వహణ, రహదారి భద్రత, వాహనాల రాకపోకలు, డ్రైవర్లకు అవసరమైన శిక్షణ తదితర అంశాలపై అధికారులతో సమగ్రంగా చర్చించారు. ముఖ్యంగా బస్సు డ్రైవర్లతో పాటు ఇతర వాహనదారులకు శాస్త్రీయ పద్ధతుల్లో ట్రాఫిక్ నిబంధనలు, సురక్షిత డ్రైవింగ్‌పై శిక్షణ అందించాల్సిన అవసరాన్ని వివరించారు. డ్రైవర్లకు క్రమం తప్పకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా నిర్లక్ష్యపు డ్రైవింగ్‌ను అరికట్టడంతో పాటు ప్రమాదాల తీవ్రతను తగ్గించవచ్చని డీసీపీ పేర్కొన్నారు. రహదారి నిబంధనలపై పూర్తి అవగాహన, ట్రాఫిక్ క్రమశిక్షణ, అత్యవసర పరిస్థితుల్లో వ్యవహరించే విధానాలపై శిక్షణ ఎంతో కీలకమన్నారు. రోడ్డు భద్రత కార్యక్రమాల్లో పోలీసు శాఖతో చీూజా సమన్వయంతో పనిచేయాలని కోరారు. డీసీపీ ప్రతిపాదనపై చీూజా అధికారులు సానుకూలంగా స్పందించి, ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఏర్పాటుతో పాటు రహదారి భద్రత కార్యక్రమాలకు అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ట్రాఫిక్ ఏసీపీ ఎ. చంద్రశేఖర్, షాద్‌నగర్ ట్రాఫిక్ ఎస్‌హెచ్‌ఓ బి. శంకరయ్య పాల్గొన్నారు.

# విద్యార్థులతో కలిసి భోజనం

## మధ్యాహ్న భోజన నాణ్యతను స్వయంగా పరిశీలించిన అదనపు కలెక్టర్ వై.వి. గణేష్

**గీసుకొండ, ఆగష్టు 25 హైదరాబాద్ ఎస్టేట్:**



విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన నాణ్యతను తెలుసుకునేందుకు వరంగల్ జిల్లా అదనపు కలెక్టర్ వై.వి. గణేష్ వారితో కలిసి భోజనం చేశారు. గీసుకొండ మండలం గంగాదేవిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించిన ఆయన భోజనం రుచి, నాణ్యతను స్వయంగా పరిశీలించారు. వనమహోత్సవంలో భాగంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించి, నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు ప్రతిరోజూ నాణ్యమైన, పౌష్టికాహారం అందేలా చూడాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థులకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించాలని అదనపు కలెక్టర్ సూచించారు. పాఠశాల ఆవరణలో నాటిన మొక్కలను సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి వెన్న కృష్ణవేణి, స్థానిక సర్పంచ్ కూసం స్వరూపరమేష్, ప్రధానోపాధ్యాయుడు ఎం.డి. రాజాక్, ఉపాధ్యాయులు కొల్లూరి రవీందర్, పంచాయతీ కార్యదర్శి వద్దిరాజు, వార్డు సభ్యులు, పాఠశాల సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఏపీఎల్ మహిళా క్రికెటర్ల వేలం

## : అత్యంత పిన్న వయస్కురాలిగా 12 ఏళ్ల షణ్ముఖప్రియ ఘనత




W`APL వేలంలో ప్రత్యేక ఆకర్షణగా 12 ఏళ్ల షణ్ముఖ ప్రియ
హోరాహోరీగా సాగిన వేలంలో 74 మంది క్రీడాకారిణుల కొనుగోలు
గోదావరి జట్టుకు రికార్డు స్థాయిలో రూ.4.30 లక్షలకు అమ్ముడైన హెర్నిటా
సెప్టెంబర్ 15 నుంచి ాాామంగళగిరి స్టేడియంలో ం20 టోర్నీ

# కొమ్మాలలో వనమహోత్సవం

## మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి పిలుపు

**గీసుకొండ, ఆగష్టు 25 హైదరాబాద్ ఎస్టేట్:**

మండలంలోని కొమ్మాల గ్రామంలో నిర్వహించిన ప్రత్యేక వనమహోత్సవ కార్యక్రమంలో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి పాల్గొని మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణతో పాటు పచ్చదనం పెంపునకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు గ్రామాల్లో విస్తృతంగా మొక్కలు పెంచాలని సూచించారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కొమ్మాల సర్పంచ్ కన్నెబోయిన యమున, ప్రవీణ్ యాదవ్, విశ్వనాధపురం సర్పంచ్ ధరావత్ జ్యోతి, నందనాయక్, తండా సర్పంచ్ బాధావత్ వీరేందర్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, తహసీల్దార్ రియాజ్, ఎంపీడీవో కృష్ణవేణి, గీసుకొండ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దాడి శివ, జిల్లా ప్రధాన కార్యదర్శి తుమ్మనపెల్లి శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి వంకుడోతు గోపాల్, గ్రామ పార్టీ అధ్యక్షుడు ఈర్ల ప్రవీణ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సాయిలి ప్రభాకర్, నాగారపు స్వామి, కదారి రాజు, బీఎల్‌ఏ జెల్లెల రవి, జక్కుల రవి, గట్టు రామ్‌రెడ్డి, గడ్డమిది రమేష్,




బట్టమేకల రాజయ్య, అంగోతు వీరన్న, అంగోతు సమ్మయ్య, బాధావత్ రాంబాబు, హలావత్ వీరన్న, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నిరాధార ఆరోపణలు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవు

**హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఆగస్టు 25:-**

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం కొంగరకుర్దు పరిధిలోని రాజధాని డెవలపర్స్ వెంచర్ భూముల వివాదం తాజాగా మరో మలుపు తిరిగింది. తమ భూములను కబ్జా చేసి, నకిలీ పత్రాలతో వెంచర్ ఏర్పాటు చేస్తున్నారంటూ కొందరు రైతులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ ఆరోపణలను ఖండిస్తూ మంగళవారం వెంచర్ నిర్వాహకులు, భూ యజమానులు విలేకరుల సమావేశం నిర్వహించి తమ వివరణను వెల్లడించారు. భూ యజమాని నిమ్మ రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. తమపై వచ్చిన ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని స్పష్టం చేశారు. తాము తొమ్మిది మంది అన్నదమ్ములమని, 46 ఏళ్లుగా ఈ భూములను సాగు చేసుకుంటున్నామని తెలిపారు. ఈ ఆస్తి తమ తాతముత్తాతల నుంచి వంశపారంపర్యంగా తమకు సంక్రమించిందని పేర్కొన్నారు. వెంచర్‌కు సంబంధించిన తొమ్మిది ఎకరాల భూమి 295, 291, 292, 96, 97 సర్వే నంబర్లలో ఉందని తెలిపారు. ఫిర్యాదుదారులు పేర్కొన్న సర్వే నంబర్లకు తమ భూములకు ఎలాంటి సంబంధం లేదన్నారు. రెవెన్యూ అధికారుల సమక్షంలో నిబంధనల ప్రకారం సర్వే నిర్వహించారని, పరిసర రైతులకు ముందస్తు సమాచారం ఇచ్చి ప్రక్రియ పూర్తి చేశారని వివరించారు. తమ భూమికి సమీపంలో అటవీ శాఖ భూమి ఉన్నందున సంబంధిత శాఖ నుంచి కూడా ఓఆర్‌సీ పొందినట్లు తెలిపారు. ఆధారాలు లేకుండా తమపై ఆరోపణలు చేస్తే పోలీస్ స్టేషన్‌తో పాటు



న్యాయస్థానాన్ని ఆశ్రయించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రవీందర్‌రెడ్డి హెచ్చరించారు. రాజధాని డెవలపర్స్ మేనేజర్ కిరణ్ కూడా తమ వద్ద ఉన్న పత్రాలు, కోర్టు ఉత్తర్వుల మేరకే రోడ్డు ఏర్పాటు చేస్తున్నామని స్పష్టం చేశారు.

# పోలీసులకు విధుల్లో పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలి

## కానిస్టేబుళ్ల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసే ప్రచారాన్ని అరికట్టాలి

## : బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకుడు కనుకుంట్ల రంజిత్‌కుమార్

**వరంగల్, ఆగష్టు 25 హైదరాబాద్ ఎస్టేట్:**

ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణలో ముందుండే పోలీసు సిబ్బందికి విధి నిర్వహణలో పూర్తి స్వేచ్ఛ, అవసరమైన అధికారాలు కల్పించాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకుడు కనుకుంట్ల రంజిత్‌కుమార్ కోరారు. క్షేత్రస్థాయిలో పనిచేసే కానిస్టేబుళ్లకు ఉన్నతాధికారులు అండగా నిలిచి వారి ఆత్మస్థైర్యాన్ని కాపాడాలని అన్నారు. మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఉరుసుగుట్ట వద్ద ఇటీవల చోటుచేసుకున్న ఘటనపై సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారంపై ఆయన స్పందించారు. ఘటనకు సంబంధించిన పూర్తి వాస్తవాలను అధికారులు ప్రజలకు వెల్లడించాలని కోరారు. పూర్తి వివరాలు తెలియకుండానే ఏకపక్ష ప్రచారానికి పాల్పడటం ద్వారా పోలీసులపై అపోహలు ఏర్పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రజలకు ఎలాంటి ఆపద ఎదురైనా ముందుగా స్పందించేది క్షేత్రస్థాయిలో విధులు నిర్వర్తించే కానిస్టేబులేనని అన్నారు. ఎండ, వాన, చలి లెక్కచేయకుండా ప్రజలకు భద్రత కల్పిస్తూ, ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ కార్యక్రమాలకు బందోబస్తు నిర్వహిస్తున్నారని తెలిపారు. నేరాల నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాల కట్టడిలో వారి పాత్ర అత్యంత కీలకమన్నారు. మద్యం, మాదకద్రవ్యాల వినియోగం, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు పోలీసులు సమర్థంగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. పరిస్థితులకు అనుగుణంగా కఠినంగా వ్యవహరించాల్సి వచ్చినప్పుడు విధి నిర్వహణకు ఆటంకం కలగకుండా పోలీసులకు సహకరించాలని ప్రజలను కోరారు. పండుగలు, కుటుంబ వేడుకలకు దూరంగా ఉంటూ ప్రజా భద్రత కోసం పోలీసులు నిరంతరం విధులు నిర్వర్తిస్తున్నారని రంజిత్‌కుమార్ తెలిపారు. ధర్నాలు, రాస్తారోకోలు,



ప్రజా కార్యక్రమాలు, అత్యవసర పరిస్థితుల్లోనూ భద్రతా బాధ్యతలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. విధి నిర్వహణలో పోలీసులపై ఒత్తిడి లేకుండా, ప్రజల భద్రతకు ప్రాధాన్యమిస్తూ సమర్థంగా పనిచేసే వాతావరణాన్ని ఉన్నతాధికారులు కల్పించాలని ఆయన కోరారు. ఉపాధ్యాయుల చేతిలో బెత్తం, పోలీసుల చేతిలో తుపాకీ సమర్థంగా పనిచేసినప్పుడే సమాజంలో క్రమశిక్షణ, శాంతిభద్రతలు పరిరక్షించగలమని కనుకుంట్ల రంజిత్‌కుమార్ పేర్కొన్నారు.

# కొమ్మాలలో పచ్చదనం కోసం.. కిలోమీటరున్నర మేర మొక్కలు

## - వన మహోత్సవంలో మొక్కలు నాటిన ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

## - సర్పంచ్ కన్నెబోయిన యమున ప్రవీణ్ ఆధ్వర్యంలో ఘనంగా కార్యక్రమం

**గీసుకొండ, ఆగష్టు 25 హైదరాబాద్ ఎస్టేట్:**

పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించే బాధ్యతను కూడా స్వీకరించాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి పిలుపునిచ్చారు. గ్రామాల్లో పచ్చదనాన్ని పెంపొందించేందుకు విస్తృతంగా మొక్కలు నాటి వాటి సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. గీసుకొండ మండలం కొమ్మాల గ్రామంలో సర్పంచ్ కన్నెబోయిన యమున ప్రవీణ్ ఆధ్వర్యంలో మంగళవారం వన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కొమ్మాల లక్ష్మీనరసింహస్వామి ఆలయ ముఖద్వారం నుంచి ఆలయం వరకు ఉన్న ప్రధాన రహదారికి ఇరువైపులా సుమారు కిలోమీటరున్నర మేర మొక్కలు నాటారు. ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అధికారులు, ప్రజాప్రతినిధులు, వార్డు సభ్యులు, మహిళలు, విద్యార్థులు, గ్రామస్థులతో కలిసి కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చెట్ల పెంపకంతో పర్యావరణ సమతుల్యతను కాపాడటంతో పాటు భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చన్నారు. సకాలంలో వర్షాలు కురవడం, వాతావరణ సమతుల్యత కొనసాగడంలో చెట్లు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించి వృక్షంగా ఎదిగేలా చూడాలని కోరారు. కొమ్మాల గ్రామంలో వన మహోత్సవాన్ని ప్రణాళికాబద్ధంగా నిర్వహించిన సర్పంచ్ కన్నెబోయిన యమున ప్రవీణ్‌ను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు.



పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెంచుతూ స్థానిక ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవడం అభినందనీయమన్నారు. అనంతరం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో కలిసి ఎమ్మెల్యే, సర్పంచ్ మొక్కలు నాటారు. పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే.. భోజన నాణ్యత, మెనూ అమలుపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వై.వి. గణేష్, మండల ప్రత్యేక అధికారి రమేష్, ఎంపీడీఓ వెన్న కృష్ణవేణి, తహసీల్దార్ ఎం.డి. రియాజుద్దీన్, ఏపీఓ చంద్రకాంత్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ సమ్మయ్య, ఆర్ఐ సాంబయ్య, సర్పంచులు అర్పిత దిలీప్‌రెడ్డి, వీరేందర్, జ్యోతి, సతీష్, నాయకులు దాడి శివ, తుమ్మనపల్లి శ్రీనివాస్, గోపాల్, దుల వెంకటేశ్వర్లు, కొమ్ము శ్రీకాంత్, మద్రి క్రాంతి, గట్టు రజిత, పంచాయతీ కార్యదర్శులు మురళి, శ్రీధర్, వీరేష్, జీపీఓలు రవి, అశోక్, వార్డు సభ్యులు యశ్వంత్, నవీన, సుమన్, రవి, అనూష, కోమల, మణి, ఎడ్ల బాబు, సాయిలి శ్రీను, కడారి రాజు, సాయిలి ప్రభాకర్, రాంరెడ్డి, గడ్డమీది రమేష్, జక్కుల రవి, ఈర్ల ప్రవీణ్, దూడే రాజ్‌కుమార్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

RNI No Tel / 2012 /4241
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
26 బుధవారం ఆగస్టు 2026

# వాతావరణ సమతుల్యాన్ని కాపాడదాం.

**హైద్రాబాద్ ఎస్టేట్ ప్రతినిధి భాస్కర్ హన్మకొండ**

వాతావరణ సమతుల్యాన్ని కాపాడుదాం అని చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ డాక్టర్. బీమా నాయక్ అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ( కో-ఎడ్యుకేషన్) హనుమకొండ, వన మహోత్సవం అటవీ శాఖ మరియు ఎన్.ఎస్. ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మొక్కను నాటి ఈ సందర్భంగా మాట్లాడుతూ వాతావరణ సమతుల్యాన్ని కాపాడినప్పుడే సకాలంలో వర్షాలు పడతాయని ప్రతి ఒక్కరూ ఇంటి వద్ద గాని, బావి దగ్గర గాని, కళాశాలలో గాని, ఇంటి ఇరువైపులా గాని, మొక్కలను నాటినప్పుడు అవి కార్బన్డయాక్సైడ్ తీసుకుని స్వచ్ఛమైన ఆక్సిజన్ ఇస్తుందని అన్నారు, ఏలినో ప్రభావం వల్ల భూ వాతావరణ వేడికి సకాలంలో వర్షాలు పడడం లేదని దీని అంతటికి కారణం అడవులు నరికి వేయడం వల్లే, వర్షాలు పడడం లేదని, అడవుల్లో ఉండే జంతువులు జనావాసాల్లోకి వస్తున్నాయని వాటికి అడవిలో ఆహారం లేకపోవడం వల్లే ఈరోజు గ్రామాల్లో జంతువులు తిరుగుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపల్ ఙ.సంధ్యారాణి, అధ్యాపకులు కే.శ్రీధర్, ఎం. సాంబశివయ్య, ఎన్. యాకూబ్,-ూా.శోభ, కే రేవతి, ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎస్. రాజ్ కుమార్ మరియు అటవీశాఖ హనుమకొండ డిస్టిక్ ఫారెస్ట్




ఆఫీసర్ ముకుంద రెడ్డి, హనుమకొండ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ టి. శ్రీనివాస్, హనుమకొండ డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ బి. మోహన్, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు

# ఇన్స్పైర్ జూనియర్ కాలేజ్‌లో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు

**హైద్రాబాద్ ఎస్టేట్ ప్రతినిధి భాస్కర్ హన్మకొండ**

ఇన్స్పైర్ జూనియర్ కాలేజ్ ఆధ్వర్యంలో జూనియర్ విద్యార్థులకు ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలను నిర్వహించారు. “ఎంబార్క్ 2ఖ26” పేరుతో మంగళవారం హనుమకొండలోని మీ= ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమం విద్యార్థుల్లో నూతన ఉత్సాహాన్ని నింపింది.

కాలేజ్‌లో నూతనంగా చేరిన జూనియర్ విద్యార్థులకు సీనియర్ విద్యార్థులు ఆత్మీయంగా స్వాగతం పలుకుతూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులలో ఉన్న ప్రతిభను వెలికితీయడం, వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం, ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకుని వాటి సాధనకు కృషి చేయాలనే ఉద్దేశంతో ఈ ఫ్రెషర్స్ డే వేడుకలను నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఈ కార్యక్రమానికి హనుమకొండ జిల్లా మాజీ అధ్యక్షురాలు రావు పద్మారెడ్డి గారు, మేర కార్పొరేషన్ చైర్మన్ సంగ వెంకటరాజం గారు, పర్వతగిరి సీఐ రాజగోపాల్ గారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఇంటర్మీడియట్ విద్యార్థి జీవితంలో అత్యంత కీలకమైన దశ అని, ఈ సమయంలో సమయపాలన, క్రమశిక్షణ, పట్టుదలతో చదివితే భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని సూచించారు. విద్యార్థులు తమ లక్ష్యాలను ముందుగానే నిర్ణయించుకుని, వాటి సాధన కోసం నిరంతరం కృషి చేయాలని వారు ఆకాంక్షించారు.

అలాగే ఇన్స్పైర్ జూనియర్ కాలేజ్ చైర్మన్ తీగల భరత్ గౌడ్ గారు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి విద్యార్థిలో ప్రత్యేకమైన ప్రతిభ దాగి ఉంటుందని, దానిని గుర్తించి సరైన దిశలో ముందుకు సాగాలని సూచించారు. విద్యార్థుల విద్యాభివృద్ధితో పాటు వారి వ్యక్తిత్వ వికాసానికి కూడా కాలేజ్ యాజమాన్యం ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. భవిష్యత్తులో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించి కాలేజ్‌కు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

ఈ సందర్భంగా వివిధ పోటీ పరీక్షల్లో స్టేట్ ర్యాంకులు సాధించిన ప్రతిభావంతులైన విద్యార్థులను ఘనంగా సన్మానించి అభినందించారు. వారి విజయాలను స్ఫూర్తిగా తీసుకుని ఇతర విద్యార్థులు కూడా ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని నిర్వాహకులు సూచించారు.

కార్యక్రమంలో కాలేజ్ ప్రిన్సిపాల్ సుంకరి శ్రీరామ్ రెడ్డి గారు, డైరెక్టర్లు తీగల రాజ్ కుమార్ గారు, కోటిచింతల మమత కుమారి గారు పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు



చదువుతో పాటు క్రమశిక్షణ, సమయపాలన, మంచి ఆలోచనా విధానాన్ని అలవర్చుకోవాలని వారు సూచించారు.

సీనియర్ విద్యార్థులు నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, వినోద కార్యక్రమాలు, ప్రతిభా ప్రదర్శనలు విద్యార్థులను విశేషంగా ఆకట్టుకున్నాయి. జూనియర్లు, సీనియర్లు ఉత్సాహంగా పాల్గొనడంతో “ఎంబార్క్ 2ఖ26” వేడుకలు సందడిగా, ఆహ్లాదకరంగా సాగాయి.

ఈ సందర్భంగా కాలేజ్ యాజమాన్యం మాట్లాడుతూ, విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించడంతో పాటు వారికి మంచి విద్యా వాతావరణాన్ని అందిస్తూ, ఉన్నత విద్య మరియు భవిష్యత్ కెరీర్‌కు అవసరమైన మార్గదర్శకత్వాన్ని అందించడమే ఇన్స్పైర్ జూనియర్ కాలేజ్ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

# జానపద సంస్కృతిపై చేసిన కృషికి ప్రత్యేక గుర్తింపు

### - జానపద గిరిజన విజ్ఞానపీఠం పీఠాధిపతి ఆచార్య గడ్డం వెంకన్న..

### - జానపద విజ్ఞాన సాఫల్య పురస్కారానికి ఎంపికైన పీఠం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బానని సురేష్ కు ఘన సన్మానం

**హైద్రాబాద్ ఎస్టేట్ ప్రతినిధి భాస్కర్ హన్మకొండ**
**ప్రచురణార్థం తేదీ: 25.08.2026**

జానపద సంస్కృతిపై చేసిన కృషికి ప్రత్యేక గుర్తింపు లభించిందని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం జానపద గిరిజన విజ్ఞానపీఠం పీఠాధిపతి ఆచార్య గడ్డం వెంకన్న అన్నారు. ఈ మేరకు 2025 సంవత్సరానికి గాను జానపద సాహిత్య పరిషత్ హైదరాబాద్ వారు ప్రదానం చేసే జానపద విజ్ఞాన సాఫల్య పురస్కారానికి వరంగల్ లోని తెలుగు విశ్వవిద్యాలయం జానపద గిరిజన విజ్ఞాన పీఠంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ బానని సురేష్ ఎంపికైయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం వరంగల్ హంటర్రోడ్లోని జానపద గిరిజన విజ్ఞాన పీఠంలో జరిగిన కార్యక్రమంలో పీఠాధిపతి ఆచార్య గడ్డం వెంకన్న, సిబ్బంది బాసని సురేష్ ను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆచార్య గడ్డం వెంకన్న మాట్లాడుతూ బానని సురేష్ జానపదులపై 25కు పైగా వ్యాసాలు రాసారని, జానపద సాహిత్య అధ్యయనానికి ప్రత్యేక గౌరవం లభించడం ఆయన కృషి ఎంతో దోహదపడిందని అభినందించారు. బానని సురేష్ మాట్లాడుతూ జానపద విజ్ఞాన సాఫల్య పురస్కారానికి ఎంపిక కావడం సంతోషంగా ఉందని అన్నారు. పీఠం అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ శ్రీమంతుల దామోదర్, డాక్టర్ చూరేపల్లి రవికుమార్, అబ్బు గోపాల్ రెడ్డి, డాక్టర్ గంపా నతీష్, పరిశోధకుడు సోనబోయిన సతీష్ మాట్లాడుతూ బానని సురేష్ కనుమరుగవుతున్న జానపద కళారూపాలను వెలికితీసి, జానపద ప్రజల జీవన విధానం, సంస్కృతి, చరిత్రను ప్రత్యక్షంగా సేకరించి



తెలియజేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ ఆమేర్ అలీఖాన్, సిబ్బంది బుక్ బేరర్ సిద్దోజు నునంద, ఆంజనేయులు, ఆశోక్, కస్తూరిబాయి, సులోచన, మధు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫొటోలు..

1.అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వానని సురేష్ ను సన్మానిస్తున్న పీఠాధిపతి ఆచార్య గడ్డం వెంకన్న

2.మాట్లాడుతున్న పీఠాధిపతి ఆచార్య గడ్డం వెంకన్న

# మాధవన్‌జీ హెల్త్ సిటీలో ఘనంగా 9వ వనమహోత్సవం

## : పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట...

**( హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి ఆగస్టు 25)**

తెలంగాణ ప్రభుత్వ హరితహారం స్ఫూర్తితో మాధవన్‌జీ ఇంటిగ్రేటెడ్ హెల్త్ సిటీలో 9వ వనమహోత్సవ వేడుకలను అత్యంత కోలాహలంగా నిర్వహించారు. 2018 నుండి ప్రతి ఏడాదీ నిరంతరాయంగా వనమహోత్సవాన్ని నిర్వహిస్తూ, పచ్చదనం పెంపుదలకు కృషి చేస్తున్న ఏకైక హెల్త్ సిటీగా మాధవన్‌జీ ప్రత్యేక గుర్తింపు పొందింది.

మధ్యాహ్నం 12 గంటలకు ప్రాంగణానికి విచ్చేసిన అటవీ శాఖ అధికారులకు హెల్త్ సిటీ మేనేజింగ్ డైరెక్టర్ పి. తరుణ్, సీఈఓ డాక్టర్ బి. శేషాద్రి, జనరల్ మేనేజర్ కె. గణేష్ పుష్పగుచ్ఛాలు అందజేసి సాదర స్వాగతం పలికారు. అనంతరం క్యాంపస్ ప్రధాన గ్రౌండ్‌లో మొక్కలు నాటే కార్యక్రమం వైభవంగా ప్రారంభమైంది.

మొక్కలు నాటిన అధికారులు, యాజమాన్యం

అటవీ అధికారుల శ్రీకారం: షంషాబాద్ ఎఫ్‌డీవో ఆర్. వెంకటయ్య పండ్ల మొక్కను నాటి కార్యక్రమాన్ని ప్రారంభించగా, మంఖాల్ ఎఫ్ఆర్‌వో జె. ప్రభాకర్, డిప్యూటీ ఆర్‌వో కె. రాజేందర్ రెడ్డి వేప, రావి మొక్కలను నాటారు.



యాజమాన్యం & విద్యార్థుల ఉత్సాహం: ఎమ్‌డీ తరుణ్, సీఈఓ శేషాద్రి, డైరెక్టర్ హరిప్రసాద్, నర్సింగ్ ప్రిన్సిపల్స్ స్వాతి, శ్వేత, బి.ఎడ్ ప్రిన్సిపల్ హనుమంతరావు, ఎస్టేట్ మేనేజర్ వెంకన్నలు మొక్కలు నాటి నీళ్లు పోశారు. నర్సింగ్ విద్యార్థినులు స్వయంగా గుంతలు తవ్వి మొక్కలు నాటడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ముఖ్య అతిథుల ప్రసంగం

ఆర్. వెంకటయ్య (ఖీణా): “ప్రతి ఒక్కరూ జీవితంలో కనీసం 10 మొక్కలు నాటాలి. ప్రతి మొక్కకు ఒక విద్యార్థి పేరు పెట్టి బాధ్యత అప్పగిస్తే, అవి 100 శాతం పెరుగుతాయి. ఏటా వనమహోత్సవం నిర్వహిస్తున్న మాధవన్‌జీ యాజమాన్యం



అభినందనీయం.“

పి. తరుణ్ (ఎండీ ): “ఆరోగ్యం అంటే కేవలం ఆసుపత్రే కాదు, పరిశుభ్రమైన పర్యావరణం కూడా. ఇప్పటివరకు మా క్యాంపస్‌లో 5,000 పైగా మొక్కలు నాటి సంరక్షించాం. ఈ ఏడాది మరో 1,000 మొక్కలు నాటడమే మా లక్ష్యం.“

కార్యక్రమం ముగింపులో విద్యార్థులందరిచే పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేయించారు. ఈ వేడుకలో అధ్యాపకులు, నాన్-టీచింగ్ సిబ్బంది మరియు వందలాది మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# మల్లారెడ్డికి ఘన నివాళి

### రైతాంగ ఉద్యమానికి ఆయన సేవలు చిరస్మరణీయం

### : కూరపాటి వెంకటనారాయణ

**హైదరాబాద్, ఆగస్టు 25 హైదరాబాద్ ఎస్టేట్:**



ఆగస్టు 25: కమ్యూనిస్టు పార్టీ తొలితరం నాయకుడు, అఖిల భారత రైతు సంఘం ఉపాధ్యక్షుడిగా పనిచేసిన రైతాంగ ఉద్యమ నేత కామ్రేడ్ సారంపల్లి మల్లారెడ్డికి పలువురు నాయకులు ఘన నివాళులర్పించారు. హైదరాబాద్‌లోని ఎంబీ భవన్‌లో మల్లారెడ్డి భౌతికకాయానికి తెలంగాణ రాష్ట్ర తెలుగు అకాడమీ చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కూరపాటి వెంకటనారాయణ మాట్లాడుతూ.. రైతుల సమస్యలు, హక్కుల సాధన కోసం మల్లారెడ్డి జీవితాంతం పోరాడారని తెలిపారు. రైతాంగ ఉద్యమాన్ని బలోపేతం చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించారని, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడిన ఆయన నిబద్ధత స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. రైతాంగ ఉద్యమానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయంగా నిలిచిపోతాయని అన్నారు. మల్లారెడ్డి మృతి రైతాంగ ఉద్యమానికి తీరని లోటని నాయకులు పేర్కొన్నారు. ఆయన పోరాట స్ఫూర్తిని కొనసాగిస్తూ రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడ్డి శ్రీనివాస్, తెలంగాణ ఉద్యమ నాయకుడు సోమ రామమూర్తి, తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఓదెల రాజయ్య, సంఘం కోశాధికారి సిర్ల రవీందర్‌తో పాటు పలువురు సంఘ నాయకులు పాల్గొని నివాళులర్పించారు.

# ఫీజుల బకాయి - బీజేపీ లడాయి

### - 48 గంటల బీజేపీ రాష్ట్ర అధ్యక్షుల నిరాహార దీక్షకు

### వనపర్తి బీజేపీ నాయకుల సంఘీభావం



**హైదరాబాద్ ఎస్టేట్ లక్ష్మీ నారాయణ వనపర్తి జిల్లా ప్రతినిధి**

40 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తూ, ₹15,000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను పెండింగ్‌లో పెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా తెలంగాణ బీజేపీ అధ్యక్షులు శ్రీ ఎన్. రాంచందర్ రావు చేపట్టిన 48 గంటల నిరాహార దీక్షకు వనపర్తి జిల్లా బీజేపీ నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వనపర్తి జిల్లా బీజేపీ అధ్యక్షులు డి. నారాయణ హైదరాబాద్‌లోని రాష్ట్ర పార్టీ కార్యాలయంలో నిరాహార దీక్షలో పాల్గొని మద్దతు తెలిపారు. అనంతరం డి. నారాయణ మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తుతో కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటమాడటం సరికాదని, వెంటనే ₹15,000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఫీజు బకాయిల కారణంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరారు. “ఫీజుల బకాయి బీజేపీ లడాయి” పేరుతో చేపట్టిన ఈ ఉద్యమం ద్వారా విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నామని, విద్యార్థుల హక్కుల కోసం భారతీయ జనతా పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని నారాయణ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మెంటం పల్లి పురుషోత్తం రెడ్డి శ్రీశైలం, సీనియర్ నాయకులు సీతారాములు ప్రభాకర్, వెంకటేష్ నాయుడు, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు అరవింద్, యువమోర్చా నాయకులు చింతకాయల శివ, నవీన్, చందు, వెంకటేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యల పరిష్కారంలో భాగంగా బషీర్బాగ్ పోలీస్ కమిషనరేట్ లో ఇన్ వార్డ్ సెక్షన్ ఏర్పాటు చేయాలి

### శివసేన తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుదర్శన్






**హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి హైదరాబాద్**

ఈ రోజు హైద్రాబాద్ పోలీస్ కమిషనర్ శ్రీ సజ్జనర్ గారి నీ కలిసిబషర్ బగ్ పోలీస్ కమిషనర్ ఆఫీస్ లో ఇన్ వార్డు సెక్షన్ లేనందువల్ల ప్రజలు అనేక ఇబ్బందుల కు గురిఆగుతున్నారని కమిషనర్ గారి దృష్టికి తీసుకెళ్లడం జరిగింది .ఇన్వాడు సెక్షన్ బషీర్ బాగ్ లో కూడా ఏర్పాటు చేసి ప్రజలకు జరుగుతున్న ఇబ్బందులకు గురికాకుండా చూడాలని, కోరటం జరిగింది . బంజారాహిల్స్ పోలీస్ కమిషనర్ ఆఫీసులో ఇన్వార్డు ఉండటం వల్ల అక్కడికి చేరుకోవడానికి ట్రాఫిక్ సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురియగుతున్నారనిశ్రీ సజ్జనార్ ముందు వాపోయారు. పోలీస్ కమిషనర్ సానుకూలంగా స్పందిస్తూ బషీర్బాగులో త్వరలో ఇన్ వర్డ్ సెక్షన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు ప్రజలకు ఇబ్బంది కలవకుండా అందుబాటులో ఉండే విధంగా బషీర్బాగ్ కమిషనర్ ఆఫీస్ లో కూడా ఇన్ వార్డు సెక్షన్ పెడతానని హామీ ఇస్తూ ప్రజా సమస్యలపై స్పందిస్తు ప్రతి ఒక్కరూ ప్రతి సమస్యను పోలీసుల దృష్టికి తేవాలని కోరారు. సమస్య పరిష్కారం కొరకు వెంటనే అందించినందుకు కమిషన్ గారికి కృతజ్ఞతలు తెలియజేశారు అనంతరం శివసేన తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుదర్శన్ గారు కమీషనర్ గారిని చాలవా తో సత్కరించారు. కమిషనర్ ను కలిసిన వారిలో వారిలోఏ సుదర్శన్ శివసేన తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడ్వకేట్ శ్రీ ప్రకాష్ రెడ్డి లీగల్ సెల్ వైస్ చైర్మన్ హ్యూమన్ రైట్స్ ర్ టి ఐ నెంబర్ తదితరులు ఉన్నారు